క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



పెదపళ్లలో అలంకార భూషితుడైన బాలగణపతి స్వామి

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో వేంచేసిన బాలగణపతి స్వామి వారి ఆలయంలో శుక్రవారం ప్రాతఃకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పుష్యమాస సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆలయ అర్చకులు పెదపూడి సత్యనారాయణాచార్యులు (సత్తిబాబు) ఆధ్వర్యంలో పురోహితుల బృందం తొలుత ఆవు పాలు, పెరుగు, తేనె, గంధం, విభూది, కుంకుమ, హరిద్ర అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర శతనామావళితో గరిక, పుష్పార్చనలు జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. బాలగణపతిని అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

భారీ అన్నసమారాధన



బెల్లంపూడిలో వేంచేసిన గేదాలమ్మ వారు

పి.గన్నవరం: మండలంలోని బెల్లంపూడిలో వేంచేసిన గేదాలమ్మ వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నిరుద్యోగ యువతకు పీఎం ఇంటర్న్‌షిప్

రాజోలు: నిరుద్యోగ యువత ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికై న వారికి నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాది పాటు రూ.60 వేలు స్టైపెండ్ చెల్లిస్తారన్నారు. దీంతో పాటు వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పిస్తారని బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బి.ఫార్మసీ, బీబీఏ డిగ్రీ ఉత్తీర్ణత అయిన వారు అర్హులన్నారు. వివరాలకు సెల్ 8247645389 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



కేశవదాసుపాలెంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వపరంగా రైతులకు అమలు చేస్తున్న పథకాల గురించి మండల ఏవో పీవీ నరసింహారావు వివరించారు. వరినాట్లు వేస్తున్న పొలాల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి ఆయన తెలిపారు. ప్రధానంగా ప్రస్తుత తరుణంలో కాండం తొలచు పురుగు తెగులు, ఆకుముడత తెగులు ఆశించినట్టు ఏవో అన్నారు. ఈ తెగులు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాము మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, రైతులతో సదరు శాఖ ర్యాలీలు నిర్వహించింది. వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో గంధోత్సవం



మామిడికుదురులో గంధోత్సవంలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం ఇమామ్ హజరత్ ఇలీ జయంత్యుత్సవంలో భాగంగా శుక్రవారం గంధోత్సవాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మామిడికుదురులోని ఖమ్రే బనీ హాసిమ్ పంజా నుంచి గంధాన్ని నగరంలోని పెద పంజీషా వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. పెద పంజీషాలో హజరత్ అలీ పీరు (పంజా)కు గంధాన్ని పూసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీనిలో భాగంగా పలువురు బాల భక్తులు హజరత్ అలీ జెండాను ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహించారు.

రహదారులు ఛిద్రం

- దమ్ముట్రాక్టర్ల స్వైర విహారం
- నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారగణం



ఆలమూరులో దమ్ము చక్రాలతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్

ఆలమూరు: రూ.కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న గ్రామీణ రహదారులను దమ్ము ట్రాక్టర్లు తారు రోడ్లు, సిమెంట్ రోడ్లను ఛిద్రం చేస్తున్నాయి. నిబంధనలు బేఖాతరు చేస్తూ రహదారులపై ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో యథేచ్ఛగా ప్రయాణించడం వల్ల రహదారులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. సంవత్సరాల తరబడి మన్నవలసిన రోడ్లు కొద్ది నెలలకే గోతులు పడి శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు రోజురోజుకు దిగజారుతున్న ఈ తరుణంలో బద్దె లేకుండా దమ్ము చక్రాలతో నడవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది. ఫలితంగా కోట్లాది రూపాయల నిధులు వృథాగా పోతున్నాయి. దమ్ము ట్రాక్టర్ల ప్రవేశానికి కనీస నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దమ్ముచక్రాలు బిగించిన ట్రాక్టర్లు రోడ్లపై స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ఇటీవల నిర్మించిన రహదారులు బీటలు వారి పోయి అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. దీనివల్ల వర్షపు నీరు గోతుల్లో ఉండి తక్కువ సమయంలోనే మరమ్మతులకు చేరుకుంటున్నాయి. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు చూసీచూడనట్లు వదిలి వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అధికారులు దమ్ముచక్రాల ట్రాక్టర్‌ను సీజ్ చేసినా పాలకుల ఒత్తిడితో సత్వరమే బయటకు వస్తున్నాయి. దీనివల్ల కూడా అధికారులు పట్టించుకోకపోవడానికి కారణంగా తెలుస్తోంది. అయితే ఇటీవల కొన్ని గ్రామాల్లో చిన్న ట్రాక్టర్లు ఎక్కువగా దమ్ము చేయడం కొంతమేర ఊరట నిస్తుంది.

నిబంధనలు పాటించని యజమానులు

ప్రభుత్వం విధించిన నిబంధనలను ట్రాక్టర్ యజమానులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుడు పొలాల్లో దమ్ము చేసేందుకు వెళుతున్నప్పుడు కచ్చితంగా చక్రాలకు ఇనుప బద్దెను అమర్చుకోవాలి. లేకుంటే పొలంలోకి టైర్లతోనే వెళ్లి అక్కడే దమ్ము చక్రాలను బిగించుకోవాలి. అనంతరం మరోపొలంలో వెళ్లాలనుకుంటే మళ్లీ టైర్లు మార్చుకుని ప్రవేశించాలి. దమ్ము పూర్తయిన అనంతర మళ్లీ టైర్లు బిగించుకుని గమ్యస్థానానికి చేరుకోవాలి. కనీస భద్రతా చర్యలు పాటించని ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేస్తే మిగిలిన వారైన నిబంధనలను పాటించే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ మండలంలో రెండేళ్ల నుంచి ఒక కేసు కూడా నమోదు కాకపోవడం అధికారుల అసమర్థతను చూపిస్తుంది. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుని ప్రజాధనంతో నిర్మిస్తున్న విలువైన రోడ్లను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



ఛిద్రమైన రోడ్డు

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



సీఆర్‌సీ సంక్రాంతి సంబరాల్లో డ్యాన్స్‌లు చేస్తున్న టీమ్‌లు

రావులపాలెం: స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద సీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేమన జయంతి, సంక్రాంతి సంబరాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. శుక్రవారం సాయంత్రం సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్కులో ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్, చిన్నారుల నృత్యాలు, డ్యాన్స్ టీమ్‌ల ప్రదర్శన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే సోషల్ మీడియాలో ఈ ప్రాంత విశిష్టతను చాటుతున్న పలువురి సత్కరించారు.

డాక్టరేట్ సాధించడం గర్వకారణం



డాక్టరేట్ అందుకున్న మురళీకృష్ణ దంపతులను సత్కరిస్తున్న సత్తిబాబురాజు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామానికి చెందిన డాక్టర్ మురళీకృష్ణ ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ అందుకోవడం ఎంతో గర్వకారణమని సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు భూపతిరాజు సత్తిబాబురాజు పేర్కొన్నారు. గోగన్నమఠంలో శుక్రవారం జరిగిన సమావేశంలో డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మురళీకృష్ణ, నాగమణి దంపతులను ఘనంగా సత్తిబాబు రాజుతో పాటు పలువురు స్థానికులు ఘనంగా సత్కరించారు. మురళీకృష్ణను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, సురేష్, సాగి సత్యనారాయణరాజు, భూపతిరాజు ఆంజనేయరాజు, ముత్యాల శ్రీనివాస్, రామానాయుడు, రుగ్మత రావు, అల్లు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హరిదాసులు తిరుగు పయనం

- ముగిసిన హరినామ సంకీర్తనలు
- మూగబోయిన పల్లెలు



హరిదాసును సత్కరిస్తున్న నాగార్జున స్ట్రీట్ సంఘ నాయకులు

కొత్తపేట: పండగ ముగిసింది.. సందడి ఆగిపోయింది.. పిల్లల కేరింతలతో కళకళలాడిన పల్లెలు మూగబోయాయి. హరిదాసుల సంకీర్తనలు ఆగిపోయాయి. పల్లెలకు వచ్చిన వారు పట్టణాలకు తిరుగు ప్రయాణమవుతుండగా వారి తల్లిదండ్రులు, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు కొండంత బాధతో వీడ్కోలు చెప్పారు. సెలవులు ముగించుకుని పట్టణాలకు బయలుదేరిన విద్యార్థులు ఏదో కోల్పోయిన భావనతో పల్లెలకు టాటా చెప్పారు.

శ్రీమద్రమా రమణ గోవిందో హరి..

ధనుర్మాసం నెల రోజుల పాటు గ్రామాల్లో వినిపించిన హరినామ సంకీర్తనలు ముక్కనుమతో ముగిశాయి. గత నెల 16 నుంచి ధనుర్మాసం ప్రారంభం కాగా వివిధ ప్రాంతాల్లో నివసించే హరిదాసులు తమకు కేటాయించిన గ్రామాల్లో ధనుర్మాసం రాకకు ప్రతీకగా శ్రీమద్రమా రమణ గోవిందో హరి... అంటూ హరినామ కీర్తనలతో గ్రామాల్లో ప్రవేశించారు. తలపై అక్షయపాత్ర, మెడలో పూలదండ, పట్టు పీతాంబరాలు, నుదుట నామాలు ధరించి, ఒక చేతిలో చిడతలు, మరో చేతిలో తంబుర పట్టి, కాళ్లకు గజ్జెలు, కమ్మని కంఠస్వరంతో విష్ణునామ స్మరణతో తెల్లవారుజాము నుంచే క్రమం తప్పకుండా వీధుల్లో దర్శనమిచ్చారు. ధనుర్మాసం ముగియడంతో గురువారం హరిదాసుల హరినామ సంకీర్తనలు వినిపించలేదు. అయితే గురు, శుక్రవారాల్లో గ్రామాలు, వీధుల్లో దర్శనమిచ్చారు. తలపై అక్షయపాత్ర లేదు, తంబుర, చిడతలు చేతిలో లేవు. వారి రాకను గుర్తించిన భక్తులు ముఖ్యంగా మహిళలు ప్రతి రోజు మాదిరిగా అక్షయపాత్రలో పోసే స్వయంపాకంతో పాటు సంక్రాంతి పిండివంటలు, నగదు, బహుమతులు సమర్పించారు. సంక్రాంతితో మా హరినామ సంకీర్తన ముగిసింది. ఆ శ్రీహరి ఆశీర్వదిస్తే మళ్లీ వచ్చే ధనుర్మాసానికి వస్తానమ్మా.. అంటూ గ్రామస్తుల వద్ద సెలవు తీసుకున్నారు. హరిదాసులకు వీడ్కోలు పలికారు. పలువురు నూతన వస్త్రాలతో సత్కరించి సాగనంపారు.



కొత్తపేటలో హరిదాసుకు స్వయంపాకం సమర్పిస్తున్న భక్తురాలు

హరిదాసుకు సత్కారం

రాజోలు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా తమ పురవీధుల్లో హరినామ సంకీర్తనలను ఆలపించిన హరిదాసును రాజోలు నాగార్జున స్ట్రీట్ యువజన సంఘం శుక్రవారం సత్కరించింది. స్థానిక నాయకుడు గుబ్బల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హరిదాసుకు రూ.3 వేలు నగదు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. ఏటా సంక్రాంతికి తమ ప్రాంతానికి రావాలని హరిదాసుకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులకు హెచ్‌బీ పరీక్షల నిర్వహణపై శిక్షణ



నగరంలో శిక్షణ ఇస్తున్న ట్రైనీ వెంకట్

మామిడికుదురు: నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు పీహెచ్‌సీలకు చెందిన ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు హెచ్‌బీ పరీక్షల నిర్వహణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఏఎన్ఎం ట్రైనీ ఆర్.వెంకట్ పరీక్షల నిర్వహణలో తీసుకోవల్సినే పలు జాగ్రత్తలను వివరించారు. గతం నుంచి పరీక్షలు చేస్తున్నప్పటికీ కొత్తగా అందుబాటులోకి వచ్చిన టిక్నాలజీకి అనుగుణంగా పరీక్షలు చేపట్టాలన్నారు. పురుషుల్లో 12 నుంచి 16 శాతం, మహిళల్లో 11 నుంచి 14 శాతం హెచ్‌బీ ఉండాలని ఆయన పేర్కొన్నారు. 8 నుంచి 11 శాతం ఉన్న వారిని మధ్యస్థ రక్తహీనులుగా గుర్తించాలని సూచించారు. అంతకన్న తక్కువ శాతం హెచ్‌బీ ఉన్న వారికి తీవ్ర రక్తహీనులుగా గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలందిస్తారని చెప్పారు. వీటిని దృష్టిలో ఉంచుకుని పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో సీహెచ్ఓ కె.సత్యవతి, ఎంపీహెచ్ఎస్ బీవీవీ సత్యనారాయణ, ఎంపీహెచ్ఓ అప్పారి నాగరాజు, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

భక్తులకు తగ్గట్టుగా ఉత్సవ ఏర్పాట్లు ఉండాలి



అంతర్వేది కల్యాణ మహోత్సవాల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: వచ్చే నెల 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ అంతర్వేది దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా ఉండాలని ఆయా శాఖలు అధికారులకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. శుక్రవారం అంతర్వేది ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల నిర్వహణపై నియోజకవర్గ స్థాయిలో ఆయన రివ్యూ చేశారు. తొలుత ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వామివారి ఉత్సవాలు నిర్వహణ పూర్వజన్మ సుకృతంగా భావించాలన్నారు. ఉత్సవాల్లో గతంలో జరిగిన పద్ధతిలో కాకుండా శానిటేషన్ మరింత మెరుగుపరచాలని పంచాయతీ రాజ్ శాఖను ఆదేశించారు. శివాలయం వీధి నుంచి బీచ్‌కు వెళ్లే రోడ్డు, వసంత మండపం వద్దకు వెళ్లే రోడ్డు మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని, రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించారు. తీర్థంలో భక్తులకు సౌకర్యంగా పార్కింగ్ స్థలాలు సిద్ధం చేయాలని కూడా సూచించారు. వీటితో పాటు తీర్థ మహోత్సవాలకు వచ్చే భక్తులను ఆకర్షించేలా వాటర్ స్పోర్ట్స్ వంటివి ఏర్పాటు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. లా అండ్ ఆర్డర్ పటిష్టంగా అమలు చేయాలని పోలీసు శాఖకు ఎమ్మెల్యే సూచించారు. తీర్థంలో తాగునీటి ప్యాకెట్లు భక్తుల అంచనాలకు మించి సిద్ధం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సూచించారు. కాగా రివ్యూలో తీర్థంలో అత్యంత రద్దీగా ఉండే ఏరియాలలో తగిన సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తుల క్యూ లైన్లు ఏర్పాటుపై అధికారుకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాకు తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్‌లు సంఖ్య పెంచాలని, రథం వెళ్లే మార్గంలో మార్జిన్ దాటి ఏ దుకాణం కూడా రోడ్డుపైకి రాకుండా చూడాలని పంచాయతీ రాజ్ శాఖకు సూచించారు. ఉత్సవాలు పదిరోజులు మద్యం లేకుండా చూడాలని ఎక్సైజ్ శాఖకు సూచించారు. కాగా ఉత్సవాల్లో చివరిరోజు తెప్పోత్సంకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు, కల్యాణ ఉత్సవాలలో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు దేవస్థానం పరంగా తీసుకుంటున్నట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఎమ్మెల్యేకు వివరించారు. ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎంపీడీవో కే.సూర్యనారాయణ, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏవీఎస్ రాజన్, గుబ్బల ఫణి, ఆర్అండ్‌బీ, ఎక్సైజ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రీసర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి



ఆలమూరు తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వేపై సమీక్షిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు: మండలంలో ఈనెల 20 నుంచి రెండో విడత చేపట్టబోయే రీసర్వేను లోపాలు లేకుండా మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో ఎం.శ్రీకర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అధ్యక్షతన శుక్రవారం రీసర్వేపై గ్రామ రెవెన్యూ శాఖతో ఆర్డీవో శ్రీకర్ సమీక్ష నిర్వహించారు. రీసర్వేలో అనుసరించవలసిన విధి విధానాలను తెలియజేశారు. రైతులందరికి సమన్యాయం జరిగేలా, వివాదాలకు తావులేకుండా తీసుకోవలసిన చర్యలపై ఆయన పలు సూచనలు, సలహాలు అందజేశారు. డీటీ టి.సుబ్బరాజు, ఆర్ఐ ఎం.రామాయమ్మ పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్, ఆర్.మల్లికార్జున్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీని వల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

వైభవంగా ముసలమ్మ అమ్మవారి తీర్థం



పినపళ్లలో శ్రీలక్ష్మీ స్వరూప ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని పినపళ్లలో వేంచేసిన శ్రీలక్ష్మీ స్వరూప ముసలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్థానిక పేపరుమిల్లు రోడ్డులో నెలకొల్పిన అమ్మవారి ఆలయం విద్యుద్దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలిగిపోయింది. బాణసంచా పేలుళ్లతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. తొలుత గరగ రూపంలో ఉన్న అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించగా మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవికలు సమర్పించారు. గ్రామం నలుమూలల నుంచి వచ్చిన మహిళ భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే గురువారం రాత్రి నిర్వహించిన జాతరలో ఏర్పాటు చేసిన తెలంగాణ బోనాల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విచిత్ర వేషధారణలు, కోయ నృత్యాలు అలరించాయి. శ్రీకృష్ణ ప్రభాస్ పేపరుమిల్లు అధినేతలు వంక సత్యనారాయణ (అన్నవరం), వల్లూరి వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు తదితరులు ముసలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సర్వే పారదర్శకంగా చేస్తున్నాం

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: పూర్తి అంగవైకల్యం కలిగి ఉన్న దివ్యాంగుల వివరాల సర్వేను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేస్తున్నామని ఎంపీడీవో జీవీ సరోవర్ అన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 27న 'సాక్షి'లో సర్వే పేరుతో ఏడిపించెన్ అనే వార్తా కథనం వెలువడింది. దాంతో ఉన్నతాధికారులు రీ సర్వేను ప్రారంభించారు. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 31 మంది దివ్యాంగుల సర్వేను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్ర, శనివారాలు నిర్వహించనున్నామన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ పరిధిలో 8, ముక్కామల పీహెచ్‌సీ పరిధిలో 23 మందిని 85 శాతం పైబడి అంగవైకల్యం ఉన్న దివ్యాంగులను కలెక్టర్ నియమించిన వైద్యులు సర్వే చేస్తున్నారన్నారు. ఆర్థోపెడిక్ వైద్యుడు కె.ఫణికుమార్, జనరల్ వైద్యుడు కె.అభిలాష్‌ల సమక్షంలో యాప్ ద్వారా సర్వే చేసి దివ్యాంగుల వివరాలను నమోదు చేస్తారన్నారు. వీరి వెంట వైద్యాధికారులు కేఎస్ శ్రీనివాస్, జీవీ గీతాంజలి ఉన్నారు.



మొసలపల్లిలో దివ్యాంగుడు ఇంటి వద్ద సర్వే చేస్తున్న వైద్య బృందం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో కలసిన పూర్వ విద్యార్థులు



మొగలికుదురు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం, 34వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న రోజుల నాటి మధుర స్మృతులను. చిలిపి సంఘటలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఆటలు ఆడి, పాటలు పాడి అలరించారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా కలసి కార్యక్రమంలో ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

తొండవరంలో..

అంబాజీపేట: తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో 2001-02 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరై గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆనాడు కలిసి చదువుకున్న వారంతా ఓ చోట చేరి సందడి చేశారు. ఆనాటి నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ చిన్నపిల్లల్ల మారిపోయి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

నాలుగు తరాల ఆత్మీయ కలయిక



పెదపట్నంలో మాగాపు కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

మామిడికుదురు: పెదపట్నం అగ్రహారానికి చెందిన మాగాపు నాగేశ్వరరావు, సత్యనారాయణ, ప్రసాద్ కుటుంబాలకు చెందిన నాలుగు తరాల ఆత్మీయ కలయిక శుక్రవారం ఘనంగా జరిగింది. నాలుగు తరాలకు చెందిన 50 మంది సభ్యులకు ఒకే వేదికపై సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యోగాలు, ఉపాధి రీత్యా పలు చోట్ల స్థిర పడిన కుటుంబ సభ్యులంతా సంక్రాంతి సందర్భంగా కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. కుటుంబ పెద్దలను ఘనంగా సన్మానించి వారితో ఆత్మీయతను పంచుకున్నారు.